క్లుప్తంగా

అత్యవసర సేవలు ఏర్పాటు

తుక్కుగూడ: కురుస్తున్న భారీ వర్షాల మూలంగా అత్యవసర పరిస్థితుల్లో మున్సిపాలిటీ పరిధిలో అత్యవసర సేవలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న నాగేశ్ ఫోన్ నంబర్ 9985681349, ప్రశాంత్ 9640010053ను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలకు కార్పెట్లు అందజేత



కార్పెట్లు అందిస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఇందిరా

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కోసం గురువారం ఎంపీటీసీ మాజీ సభ్యురాలు టి.ఇందిరాదేవేందర్ కార్పెట్లు అందించారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి కార్పెట్లు అందించినట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గన్స్ అమ్మేయత్నం.. యువకుడికి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

లింగోజిగూడ: బిహార్ నుంచి తీసుకొచ్చిన తుపాకులు అమ్మేందుకు యత్నించిన యువకుడిని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఎల్‌బీనగర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్, తాన బారుక్ బ్లాక్ రాంపూర్‌కు చెందిన శివకుమార్ నగరంలోని పెద్ద చెర్లపల్లిలో పుకట్‌నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటూ హమలీ పని చేస్తున్నాడు. శివకుమార్ గతంలో గాంజా చాక్లెట్లు అమ్ముతూ పట్టుబడడంతో అతనిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 6న రాఖీ పండుగ ఉండటంతో తన సొంత గ్రామానికి వెళ్లిన శివకుమార్ అక్రమంగా డబ్బు సంపాదించేందుకు స్థానికంగా నివాసం ఉండే తన బామ్మర్ది కృష్ణ పాశ్వన్ సూచన మేరకు నగరంలో దేశీయ గన్‌లను అమ్మేదుకు తీసుకొచ్చాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ మల్కాజిగిరి, చర్లపల్లి పోలీసులు చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతన్న శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని నుంచి 3గన్నులు, 10 రౌండ్స్ బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు.

కుంగిపోయిన సర్వీస్ రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌లోని జాతీయ రహదారి ఆనుకొని ఉన్న సర్వీస్‌రోడ్డు కుంగిపోయి గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వరకు ఉన్న ఈ సర్వీస్‌రోడ్డులో రెండు చోట్ల పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయి. టాయిలెట్స్ కనెక్షన్ ఉన్న డ్రైనేజీ పైపులైను ప్రాంతంలో గుంతలు పడి భూమిలోపల ఉన్న పైపులు పగిలి రోడ్డుపైకి మురుగు ప్రవహిస్తుందని స్థానికులు వాపోతున్నారు. అటుగా రాకపోకలు సాగించే క్రమంలో దుర్వాసన వస్తోందని సంబంధిత సిబ్బంది స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్: హయత్‌నగర్ పట్టణ సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క దర్శన్‌గౌడ్, సహ అధ్యక్షుడిగా క్లెం శంకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బోడ భిక్షపతి, ఉపాధ్యక్షులుగా రామసత్తయ్యగౌడ్, పర్వతి మల్లారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, టీఎస్.దాస్, లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శిగా నీరుడు సహదేవ్ ముదిరాజ్, కోశాధికారిగా లక్ష్మయ్యముదిరాజ్, సాంస్కృతిక కార్యదర్శిగా సూదం కేశవులు, జాయింట్ సెక్రెటరీలుగా గుమ్మ మధుసూదన్ రెడ్డి, గోరంటి యాదయ్య, వెంకటప్పయ్యరెడ్డి, చంద్రయ్యగౌడ్, హమీద్, దేవ ముత్యాలు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పిడుగు సుభాష్ ముదిరాజ్, బూడిద నాగభూషణంగౌడ్, రాంచందర్, రాజలింగం, బూరం భిక్షపతి, కొత్తూరి విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

జల జగడం!

- జల్‌పల్లి అలుగు నీటికి అడ్డుకట్ట వేసిన జీహెచ్‌ఎంసీ
- కట్టతెగితే ప్రమాదం ఉందని తొలగించిన మున్సిపల్ అధికారులు



జీహెచ్‌ఎంసీ వేసిన ఇసుక సంచులను తొలగిస్తున్న జల్‌పల్లి మున్సిపల్ సిబ్బంది

పహాడీషరీఫ్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అలుగు పారుతున్న మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి చెరువు వద్ద గురువారం జల వివాదం నెలకొంది. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదతో చెరువు అలుగు పారడంతో పాటు మిగులు జలాలు పి- 7 కార్గో రోడ్డులో పారుతున్నాయి. గురువారం ప్రవాహం ఎక్కువ కావడంతో రహదారి పాడవుతుందంటూ పక్కనే ఉన్న రాజేంద్రనగర్ నియోజకర్గంలోని లక్ష్మీగూడ ప్రజలు జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశారు. అక్కడి అధికారుల ఆదేశానుసారం సిబ్బంది సాయంత్రం 5 గంటల సమయంలో చెరువు వద్దకు చేరుకుని రోడ్డు పైకి నీరు రాకుండా పెద్ద ఎత్తున ఇసుక బస్తాలను అడ్డుగా పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. పూర్తిస్థాయి నిండుకుండలా మారిన చెరువు అలుగు పారడంతో పాటు కార్గో రోడ్డు వైపు ప్రశాంతంగా పారుతోందని, ఇలాంటి సమయంలో రోడ్డు వైపు మిగులు నీరు రాకుండా అడ్డుకుంటే కట్టతెగే ప్రమాదం ఉందని అక్కడికి చేరుకున్న బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, ఇరిగేషన్ ఏఈ వీరేందర్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పేర్కొన్నారు. కట్ట తెగితే గతంలో బాలాపూర్ గుర్రం చెరువు ఘటన మాదిరిగానే ప్రస్తుతం దిగువన ఉన్న ఉందాసాగర్, పల్లె చెరువులకు ప్రమాదం జరిగి రాజేంద్రనగర్, పాత బస్తీలోని వేలాది ఇళ్లకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంటుందని వెల్లడించారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ లక్ష్మణ్ సమక్షంలో జల్‌పల్లి మున్సిపల్ సిబ్బంది ఇసుక సంచులను తొలగించారు. చెరువు అలుగుతో పాటు మిగులు నీరు వస్తున్న ముత్యాలమ్మ ఆలయం వద్ద కూడా పోలీసులు నిఘా ఉంచారు.



జల్‌పల్లి చెరువు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్నారులు

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూలోని లార్డ్స్ పాఠశాలలో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో హాజరై నృత్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. దీంతో పాటు దహి హండీ వంటి పలు సాంప్రదాయ ఆటలు, చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకలో విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నాగారంలో..

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం గ్రామంలో శ్రీవిద్యా వికాస్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అందరినీ అలరించారు. పాఠశాల ఆవరణలో ఉట్లు కొట్టి సందడి చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ మంచె రాఘవేందర్‌యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహేశ్వరం: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

నిండుకుండలా కోమటికుంట

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో కోమటికుంట పూర్తిగా వర్షపు నీరుతో నిండి నిండుకుండాలా మారింది. కుంట నిండటంతో సమీప వ్యవసాయ భూముల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– తుక్కుగూడ



వరదనీటితో నిండుకుండలా కోమటికుంట

జోరువాన

- చెరువులు, కుంటలకు జలకళ
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మహేశ్వరం: మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలకు వాగులు, కాల్వల ద్వారా వరద నీరు చేరుకుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. మండల పరిధిలోని కొళ్లపడకల్ ఫతేసాగర్ చెరువు, కల్వకోల్ చెరువు, దుబ్బచర్ల చెరువు, అమీర్‌పేట్ చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు వలలు అడ్డంగా పెట్టి చేపలు పట్టుకుంటున్నారు. గొల్లూరు, సిరిగిరిపురం, దిలావార్‌గూడ, సుభాన్‌పూర్, నందుపల్లి, నాగారం, కొత్తాల్ చెరువు, పొరండ్ల, ఘట్టుపల్లి చెరువులోకి భారీగా వరదనీరు చేరుకుంటున్నాయి. మహేశ్వరం, సిరిగిరిపురం, మంఖాల్ చెరువు నుంచి భారీగా వరదనీరు రావిర్యాల పెద్ద చెరువులోకి వస్తున్నాయి. పత్తి, జొన్న, కంది పంటలకు ఎంతో మేలు చేకూరుస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చీడ పీడల బెడదపై అప్రమత్తంగా ఉండాలని.. పత్తి చేనులో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వ్యసాయాధికారులు సూచిస్తున్నారు. వర్షాలు భారీగా కురుస్తుడండడంతో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ గోవిందునాయక్, పీఆర్ ఏఈ రాంప్రసాద్, ఇన్‌స్పెక్టర్ మహిపాల్ పలువురు అధికారులు గ్రామాలను సందర్శించి నీరు వస్తున్న చెరువులు, కుంటలను పరిశీలించి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కూలేందుకు ఉన్న ఇళ్లలో నివాసం ఉండకూడదని ప్రజలకు తెలియజేస్తున్నారు.



కొళ్లపడకల్‌లో చెరువును పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజ, అధికారులు



అలుగుపారుతున్న కల్వకోల్ చెరువు

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

లింగోజిగూడ: బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా డీఈఓ సుశీంద్ర రావు అన్నారు. ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణలో భాగంగా గురువారం ఎల్‌బీనగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్, లైంగిక వేధింపులు, సైబర్ ట్రాఫికింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఓ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీలత, కృష్ణవేణి పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలి

చైతన్యపురి: పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో గణేష్ యువభక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 40 అడుగుల మట్టి గణపతి పనులను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. సుమారు 90 వేల ఇళ్లలో గణపతి పూజలు నిర్వహిస్తారని, వారంతా పురాతన శాస్త్రోక్తమైన సంప్రదాయ మట్టి గణపతిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీలు, అపార్టుమెంట్ సంక్షేమ సంఘాల నాయకులు మట్టి గణపతి ఏర్పాటు చేసేలా అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవాని ప్రవీణ్‌కుమార్, ప్రదీప్, సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరావు, రాంకుమార్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, జ్ఞానేంద్రరావు, స్వామియాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీ, ఇంద్రసేనారెడ్డినగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఆలేటి ఎల్లయ్య, పి.శ్రీనివాస్‌అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రమోహన్ పాల్గొని మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 18వేల మంది కార్మికులుగా పనిచేస్తున్నారని, అందులో అత్యాధికంగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీల కు చెందిన పేద మహిళలు ఉన్నారని వీరిని వెంటనే ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లమ్మ, యాదమ్మ, కళావతి, ఎల్లమ్మ, అంజమ్మ లక్ష్మీదేవి, హేమలత, చంద్రమ్మ పాల్గొన్నారు.

అవయవదానం కొత్త జీవితాన్నిస్తుంది

షాద్‌నగర్‌రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు మనం చేసే అవయదానం వారికి కొత్త జీవితాన్ని ఇస్తుందని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో రెడ్ రిబ్బన్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అవయవాలను దానం చేయడం ఇతరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించే గొప్ప అవకాశమన్నారు. కొందరు రోడ్డు ప్రమాదాల్లో, అనారోగ్యంతో జీవచ్ఛవంలా మారుతారని, అలాంటి వారికి అవయవాలు దానం చేయడంతో మరణం తర్వాత దాతల కుటుంబ సభ్యులు ఓదార్పును పొందుతారన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

వైభవం.. బోనాల ఉత్సవం

కందుకూరు: మండల పరిధిలోని కటికపల్లిలో గురువారం మైసమ్మ, పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.

కట్టమైసమ్మ బోనాలు..

మండల పరిధిలోని కొత్తగూడలో గురువారం కట్ట మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాలతో మహిళలు ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రావిర్యాలలో పోచమ్మ బోనాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్ల ఊరేగించారు. అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించారు.



కందుకూరు: కొత్తగూడలో బోనాల ఊరేగింపు



తుక్కుగూడ: రావిర్యాలలో బోనాలతో గ్రామస్తులు



కందుకూరు: కటికపల్లిలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

- కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలపై ప్రజలకు విసుగు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ వార్డుసభ్యులు బండ మహేందర్, బండ బాల్‌రాజ్, చిట్టెం శివలింగంలతో పాటు పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందూ, ముస్లింల మధ్యల బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతోందన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలపై విసుగు చెంది ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌కు బ్రహ్మారథం పడుతారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లోకి వెళ్లిన నాయకులు మళ్లీ సొంత గూటికి వస్తారన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ నర్సింహ పలువురు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు


విద్యార్థినులకు విద్యాజ్యోతి స్కాలర్‌షిప్స్

బడంగ్‌పేట్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థినులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందజేశారు. గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడంగ్‌పేట కెనరా బ్యాంక్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ అందజేశారు. ప్రభుత్వ బడుల్లో ప్రతిభ గల బాలికలను ప్రోత్సహించేందుకు ఈ విధంగా అవార్డులను అందజేస్తున్నామని ప్రమోద్‌కుమార్ తెలిపారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ చదువుల్లో రాణించేలా విద్యాజ్యోతి పేరుతో ప్రతి ఏటా ఇస్తున్నామన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగినప్పుడే బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

గొలుసు కట్టుకు జలకళ



జల్‌పల్లి చెరువు నుంచి దిగువకు పారుతున్న అలుగు నీరు

మత్తడి దూకుతున్న చెరువులు

- జల్‌పల్లి పరిసరాలలో ప్రకృతి రమణీయత

పహాడీషరీఫ్: గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జల్‌పల్లి పరిసరాలలోని గొలుసు కట్టు చెరువులకు జలకళ సంతరించుకుంది. శంషాబాద్ విమానాశ్రయ పరిసరాలు, మామిడిపల్లి కొండల నుంచి భారీగా వస్తున్న వరదనీరు జల్‌పల్లి చెరువుకు ప్రవాహంగా మారింది. జల్‌పల్లి గ్రామం ఎగువ నుంచి వచ్చిన నీరు కూడా తోడవడంతో అప్పటికే దాదాపుగా నిండిన ఈ చెరువు నాలుగు రోజుల నుంచి అలుగు పారడం ప్రారంభమైంది. జల్‌పల్లి చెరువు అలుగు పారడంతో పాటు మిగులు నీరు పి–7 కార్గో రోడ్డులో పెద్ద ఎత్తున పారుతుండడం.. ఈ చెరువు దిగువన ఉన్న కొచ్చెరువు సైతం పూర్తిగా నిండి కిందికి మత్తడి దూకుతున్న జల సవ్వడి దృశ్యాలను వీక్షించేందుకు జల్‌పల్లితో పాటు మైలార్‌దేవ్‌పల్లి, వాంబే కాలనీ, లక్ష్మీగూడ, శంషాబాద్, పాతబస్తీ ప్రజలు తరలివస్తున్నారు. కార్గో రోడ్డుపై పారుతున్న నీటిలో చిన్నారులు కేరింతలు కొడుతూ.. చేపలు పడుతూ.. ఈత కొడుతూ ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు. కొండలు.. చెట్లు...పచ్చిక బయళ్ల నడుమ కొనసాగింపుగా ఉన్న ఈ చెరువుల అందాలు పల్లె ప్రకృతి రమణీయతకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. నగరం దాటి ఎక్కడో వందల కిలోమీటర్ల దూరంలోని జలపాతాల వద్ద కనిపించే ఈ కమనీయ దృశ్యాలు జల్‌పల్లిలో కనిపిస్తున్నాయి.



రోడ్డుపై పారుతున్న అలుగు నీటిలో ఆడుతున్న చిన్నారులు